
ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయాల్సింది అధికారులే: ఎంపీ రఘురాంరెడ్డి

ఈటీవీ, ఖమ్మం: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయాల్సిన బాధ్యత అధికారులదేనని ఖమ్మం ఎంపీ, దిశ కమిటీ ఛైర్మన్ రామసహాయం రఘురాంరెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన దిశ కమిటీ సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కేంద్రం అమలుచేస్తున్న పీఎంఈజీపీపై అవగాహన కల్పించాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం సృష్టించాలని తెలిపారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజనను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి జతచేసి ఎక్కువ మందికి సొంతింటి కల సాకారమయ్యేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న జాతీయ రహదారుల నిర్మాణలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ప్రజల సౌకర్యార్థం దారులు ఉండాలని స్పష్టం చేశారు. గుంతలమయంగా మారిన ఖమ్మం- అశ్వారావుపేట జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. పెండింగ్ పనులకు సంబంధించిన నివేదిక సమర్పించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు ఎంపీ సూచించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో ఆసుపత్రుల నిర్మాణ పనులను ఎప్పటిలోగా పూర్తిచేస్తారని టీజీఎంఎస్‌ఐడీసీ అధికారులను ప్రశ్నించారు. గుత్తేదారు తీవ్ర జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఖమ్మం నగరపాలిక కమిషనర్ అభిషేక్ అగస్త్య, సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జడ్పీ సీఈవో దీక్షా రైనా పాల్గొన్నారు. దిశ కమిటీ సమావేశానికి తమకు ఆహ్వానం అందకపోవటంపై జిల్లా అధికారులపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.


మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ శ్రీజ, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి

ఆలయ స్థలం.. ఆదాయ మార్గం



దేవాదాయ శాఖ భూముల వివరాలు (ఎకరాల్లో)

	భద్రాద్రి	ఖమ్మం
మొత్తం భూమి	9,635.42	4,755.30
అర్చకుల ఆధ్వర్యంలో ఉన్నది	234.31	1,360.19
కౌలుకిచ్చింది	7,406.03	2,269.03
కబ్జాకు గురైంది	1,151.05	833.02
ఖాళీ స్థలాలు	844.03	293.06

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం సాంస్కృతికం

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని దేవుడి మాన్యాలు, ఆస్తుల పరిరక్షణకు దేవాదాయ, ధర్మాదాయశాఖ నడుం బిగించింది. ఆలయాల భూముల అన్యాక్రాంతాన్ని అడ్డుకునేందుకు ఆధునిక, సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తోంది. ఇందులో భాగంగా ఉభయ జిల్లాల్లోని అన్ని దేవాలయాలకు సంబంధించిన భూములకు గూగుల్ సహకారంతో జియో ట్యాగింగ్ పూర్తిచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా లీజుకిచ్చిన దేవాలయ భూములు, దుకాణ సముదాయాల వివరాలు, వాటి ద్వారా సమకూరుతున్న ఆదాయం, లీజు, అద్దె బకాయిలను వీలైనంత త్వరగా రాబట్టాలని ఇటీవల దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధికార యంత్రాంగం ఆ దిశగా కసరత్తు చేస్తోంది.

225 ఆలయాలు.. 14,391 ఎకరాలు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలోని 225 దేవాలయాల ఆధీనంలో సుమారు 14,391 ఎకరాల భూములున్నాయి. వీటిలో అత్యధికంగా 9,675 ఎకరాలు లీజు(కౌలు)కు ఇచ్చారు. వీటిద్వారా ఏటా రూ. 1.75 కోట్ల ఆదాయం సమకూరుతోందని సంబంధిత అధికారులు వెల్లడిస్తున్నారు. 1,595 ఎకరాల భూమి అర్చకుల ఆధ్వర్యంలో ఉండగా.. 1,137 ఎకరాల భూములు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దేవాలయాల ఖాళీ స్థలాల్లో సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటుచేసి ఆదాయం సమకూర్చుకోవాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే.

కబ్జా కోరల్లో 1,984 ఎకరాలు

ఉభయ జిల్లాల్లో దేవాదాయశాఖకు చెందిన 1,984 ఎకరాల భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నట్లు అధికారులు గుర్తించారు. వీటికి సంబంధించి దేవాదాయశాఖ ట్రైబ్యునల్‌లో 39, హైకోర్టులో 35 కేసులు నడుస్తున్నాయంటున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో భూముల ధరలు భారీగా పెరిగాయి. ఎకరా భూమి రూ. లక్షల్లో పలుకుతోంది. అందుకే కబ్జాకేదీ అనర్హం కాదన్నట్లు ఆక్రమణదారుల కళ్లు ఖాళీ స్థలాలపై పడుతున్నాయి. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూముల్లో ఎక్కువ శాతం దేవాలయ భూములే ఉండటం గమనార్హం. ఇప్పటికే ఖమ్మం జిల్లా పరిధిలో 833, భద్రాద్రి జిల్లాలో 1,151 ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నాయి. ఆలయ భూములకు రక్షణ కల్పించటం ప్రభుత్వ శాఖలకు సవాలుగా మారుతోంది.

ఆక్రమణలకు అడ్డుపడనుందిలా..

దేవాలయ భూములకు జియో ట్యాగింగ్ చేయటం వల్ల ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుంది. స్థలం వివరాలు, సరిహద్దులు, దేవస్థానం పేరు, ఇతర వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తాయి. జియో ట్యాగింగ్ చేసిన ఆలయ భూములు, స్థలాల వివరాలను రిజిస్ట్రేషన్ శాఖకు అనుసంధానం చేస్తారు. తద్వారా అక్రమ రిజిస్ట్రేషన్లకు ఆస్కారముండదు. జియో ట్యాగింగ్ పూర్తిచేసిన ఆలయ భూముల వివరాలను ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తపరుస్తుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దేవాదాయశాఖ భూములకు జియో ట్యాగింగ్‌తో పాటు జియో ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తే మరింత రక్షణ కల్పించవచ్చునని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వలపు వల.. చిక్కితే విలవిల

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే

అనుకోకుండా వాట్సప్ నుంచి వీడియో కాల్ వస్తుంది. ఏదైనా ముఖ్యమైన కాల్ ఏమో అని ఎత్తామా.. ఇక అంతే సంగతులు.. అవతల అందమైన స్త్రీ నగ్నంగా మాట్లాడుతుంది. ఆమె, ఇటుపక్క బాధితుడు స్క్రీన్‌మీద కనిపిస్తున్న వీడియోని రికార్డు చేస్తారు. ఇక బెదిరింపులు మొదలుపెడతారు. నగ్న వీడియోను కుటుంబ సభ్యులకు పంపుతామని, తెలిసినవారుండే గ్రూపుల్లో పెడతామని బెదిరించి రూ. లక్షల్లో దోచుకుంటున్నారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు ఈ కొత్త దోపిడీకి తెర లేపారు. పోలీసులు ఒకపక్క అవగాహన కల్పిస్తుంటే.. కొత్త విధానాలతో నేరస్థులు తెగబడుతున్నారు. ఖమ్మం , భద్రాద్రి జిల్లాల్లో కొత్తరకం సైబర్‌నేరాలు చోటు చేసుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది.



లింకులు క్లిక్ చేస్తే ఊడ్చేస్తారు..!

ఉచిత డేటా, ఐఫోన్ అంటూ ఊరించే సందేశాలు ఇప్పుడు సర్వసాధారణమయ్యాయి. ఏమాత్రం ఆశపడి క్లిక్ చేసినా బ్యాంకులో దాచుకున్న సొమ్మునంతా ఊడ్చేస్తారు. ఎవరూ ఏదీ ఉచితంగా ఇవ్వరనే విషయాన్ని గ్రహించాలి. ప్రజల మానసిక బలహీనతలతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. 'ఆన్‌లైన్ ఉద్యోగం, ఇంటి వద్దే ఉంటూ నెలకు రూ. లక్షకుపైగా సంపాదించవచ్చు', 'రోజుల వ్యవధిలో పెట్టుబడి రెట్టింపవుతుంది' వంటి ప్రకటనలు ఊరిస్తున్నాయని, వీటిని నమ్మి మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

మోసాలు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఈ ఏడాది జులై చివరి నాటికి 292 ఫిర్యాదులు అందాయి. వీటిలో రూ. 1.41 కోట్లు పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్పందించిన సైబర్ నేరవిభాగం పోలీసులు రూ. 25 లక్షలు నిందితులకు చేరకుండా బ్యాంక్‌లో హోల్డ్‌లో పెట్టించగలిగారు.

ఇవిగో ఉదాహరణలు...

- అధిక లాభాలు వస్తాయన్న ఫేస్‌బుక్ ప్రకటన నమ్మి ఖమ్మంలోని పాండురంగాపురానికి చెందిన ఉపాధ్యాయుడు స్టాక్ మార్కెట్‌లో రూ. 40లక్షలు పెట్టుబడి పెట్టారు. ఆనక మోసపోయానని గుర్తించి ఆగస్టు 13న సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.
- స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో వచ్చిన లింకును క్లిక్ చేయటంతో పాటు వివరాలు నమోదు చేసిన నగరంలోని మధురానగర్‌లో నివసించే ఉపాధ్యాయుడు రూ. 73 వేలు పోగొట్టుకున్నారు. సెప్టెంబరు 24న పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- తల్లాడలో అక్టోబరు 18న అర్ధరాత్రి ఇద్దరు నాయకులకు వాట్సప్ న్యూడ్ కాల్స్ వచ్చాయన్న వార్త కలకలం సృష్టించింది.
- ఖమ్మంలో ప్రముఖులు కొందరు అక్టోబరు నెల్లో ఇటువంటి కాల్స్‌ను ఎదుర్కొన్నారు.
- వైరాకు చెందిన ఓ వ్యక్తికి ఇటువంటి కాల్ చేసి వీడియో రికార్డు చేసిన నేరస్థులు దాన్ని ఆయనకు పంపించారు. నగదు చెల్లించాలంటూ బెదిరించారు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు.

వాట్సాప్ వీడియో కాల్ ఎత్తకండి

గుర్తు తెలియని నంబర్ నుంచి వీడియో కాల్ వస్తే లిఫ్ట్ చేయవద్దు. ఒకవేళ ఎత్తాల్సి వస్తే ఫ్రంట్ కెమెరాను వేలితో మూసి లిఫ్ట్ చేయాలి. దీంతో మనం స్క్రీన్‌లో కనిపించం. వాళ్లు రికార్డు చేసే అవకాశం ఉండదు. ఎవరైనా మోసపోతే గంట వ్యవధిలో 1930కి కాల్ చేసి వివరాలు చెప్పాలి.

- ఫణీందర్, డీఎస్పీ, సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్, ఖమ్మం

25న గవర్నర్ పర్యటన

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఖమ్మం జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పొడిశెట్టి శ్రీజ సూచించారు. అధికారులతో కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం ఎన్నెస్పీ అతిథి గృహానికి గవర్నర్ చేరుకుంటారని, 2 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమవుతారని తెలిపారు. 3 గంటలకు కవులు, కళాకారులు, కేంద్ర, రాష్ట్ర అవార్డు గ్రహీతలతో సమావేశమవుతారని చెప్పారు. 4 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరుతారని వివరించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు నివేదికలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు సిద్ధం కావాలని సూచించారు. డీఆర్డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలైతే విచక్షణ కోల్పోతారు: సీపీ



సత్తుపల్లి, న్యూస్‌టుడే: మత్తుకు బానిసలైతే విచక్షణ కోల్పోయి అనేక నేరాలకు పాల్పడతారని, ఎట్టి పరిస్థితుల్లో మాదక ద్రవ్యాల బారినపడొద్దని సీపీ సునీల్‌దత్ అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అనర్థాలపై సత్తుపల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. గంజాయి విక్రయాలు, వినియోగంలో ఎక్కువగా యువతే ఉండటం బాధాకరమన్నారు. రేపటి దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, అలాంటివారు చెడు అలవాట్లకు లోనుకావడం సరికాదని అభిప్రాయపడ్డారు. సత్తుపల్లి ప్రాంతంలో గతనెలలో గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన కేసులో నిందితులను విచారించగా వీరితో కొంతమంది యువత ఉన్నట్లు తెలిసిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, ఎవరైనా గంజాయికి అలవాటుపడినట్లు గుర్తిస్తే తమ దృష్టికి తీసుకొస్తే కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పారు. కల్లూరు ఏసీపీ ఎ.రఘు, సీఐలు టి.కిరణ్, ఎం.ముత్తులింగం, ఎస్సైలు వీరప్రసాద్, నాగరాజు, వెంకటేశ్, షాకీర్ పాల్గొన్నారు.

కేంద్ర సర్వీసుల బృందం సందర్శన

ఏన్కూరు: కేంద్ర సర్వీసుల శిక్షణ బృందం లచ్చగూడెం గ్రామాన్ని మంగళవారం సందర్శించింది. ఇషాన్‌గుప్తా, పంకజ్, అల్తాఫ్, శుభం, అంకిత్ ఉదయాన్నే వివిధ శాఖల భవనాలను పరిశీలించారు. తొలుత ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. అక్కడే వననర్సరీ, ఇంకుడుగుంతలు, గ్రామీణ రక్షితనీటి పథకం గురించి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రంలో సేవలపై ఆశాఖ అధికారులు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో బృందం సభ్యులు విద్యుత్తు సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మూడు రోజులపాటు గ్రామంలోనే ఉంటూ అన్నీ శాఖల గురించి తెలుసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో ఎస్. రమేశ్, ఎంఈవో శ్రీనివాస్, వైద్యాధికారి మౌనిక, ఎంపీవో జీవీఎస్ నారాయణ, సీహెచ్‌వో శివరాజు, సూపర్‌వైజర్ బక్కమ్మ, ఏపీవో సూరయ్య, ఏపీఎం హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ బృందానికి స్వాగతం పలుకుతున్న చిన్నారులు

కౌన్సెలింగ్‌కు 380 మంది హాజరు

ఖమ్మం విద్యావిభాగం: ఎస్ఆర్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఫార్మసీ, ఫార్మాడి కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ మహ్మద్ జాకిరుల్లా మంగళవారం తెలిపారు. వివిధ స్లాట్ల ద్వారా 395 మంది నమోదు చేసుకోగా 380 మంది హాజరయ్యారని వెల్లడించారు.

127 మందికి వైకల్య పరీక్షలు

ఖమ్మం కమాన్‌బజార్: ఖమ్మం సర్వజనాసుపత్రిలో మంగళవారం సదరం శిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 127 మంది శిబిరానికి హాజరు కాగా.. వైద్య నిపుణులు వైకల్య పరీక్షలు జరిపారు. అర్హులు 53 మంది ఉన్నట్లు నిర్ధారించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే వాహనాలను అడ్డుకున్న రైతులు

వేంసూరు, న్యూస్‌టుడే: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో పొలాలకు వెళ్లేందుకు సర్వీసు రోడ్లు నిర్మించాలని కోరుతూ వేంసూరు వద్ద రైతులు హైవే వాహనాలను అడ్డుకున్నారు. టిప్పర్ల రాకపోకలు గంటసేపు నిలిచిపోయాయి. ప్రస్తుతం పంటలు కోతకు వచ్చాయని పొలాలకు దారిలేని పరిస్థితుల్లో హైవే పక్కన సర్వీసు రోడ్లు నిర్మించాలని, తాత్కాలికంగా ఉన్న దారిని కంకరపోసి బాగు చేయాలని రైతులు కోరారు. తాత్కాలికంగా ఉన్నదారిని బాగుచేస్తామని సూపర్‌వైజర్లు చెప్పడంతో శాంతించారు. తక్కెళ్లపాటి రమేష్, చంటి, కొండేటి రాంబాబు, ఉమాబాబు తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుకు మద్దతు ధర అందించాలి: శ్రీధర్‌రెడ్డి

ఖమ్మం నగరం: ఎన్నికలకు ముందు రైతులకిచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరను పత్తి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఖమ్మంలోని భాజపా కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను దళారులు, వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులు ప్రభావితం చేయకుండా రైతులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రూ. 2 లక్షలు పంట రుణమాఫీ కేవలం 40 శాతం మంది రైతులకు మాత్రమే చేసి కాంగ్రెస్ సర్కారు గొప్పలు చెప్పుకొంటోందని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ అని హామీ ఇచ్చి ఇప్పుడు సన్న వడ్లకే బోనస్ అంటున్నారని, దొడ్డు రకానికి బోనస్ ఎందుకివ్వరని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ఆయిల్‌పామ్ గెలల ధర పెరిగి రైతులకు లాభం జరిగిందన్నారు. సీసీఐ ద్వారా క్వింటా పత్తికి రూ. 7,521 మద్దతు ధర రైతులకు అందించాలన్నారు. భాజపా జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 50వేల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, సరస్వతి, అంజయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వైద్యం.. అందనంత దూరం!

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

ప్రభుత్వ ప్రధానాసుపత్రులు మొదలు ఆరోగ్య ఉపకేంద్రాల వరకు వైద్యసిబ్బంది కొరత వేధిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 2023లోని పరిస్థితులపై కేంద్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఇటీవల వెలువరించిన 'హెల్త్ డైనమిక్స్ ఆఫ్ ఇండియా' నివేదిక ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

భద్రాద్రి జిల్లాలో వైద్యులు, సిబ్బంది కలిపి 490 మంది విధులు నిర్వర్తించాల్సి ఉండగా 316 మంది పనిచేస్తున్నారు. ఆరు సీహెచ్‌సీల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత వేధిస్తోంది. కొన్నిచోట్ల దంత వైద్యులు, గైనకాలజిస్టులతోనే నెట్టుకొస్తున్నారు. ఖమ్మం జిల్లాలో పీహెచ్‌సీలు-26, పట్టణ ఆరోగ్య కేంద్రాలు-4, ఆరోగ్య ఉపకేంద్రాలు-231 ఉన్నాయి. పీహెచ్‌సీల్లో 76 వైద్యుల పోస్టులకు 27, స్టాఫ్ నర్సులు 70 పోస్టులకు 12, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫిమేల్) 213 పోస్టులకు 45, ఎంపీహెచ్‌డబ్ల్యూ(మేల్) 147 పోస్టులకు 107 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఫీల్డ్ వర్కర్స్ 45 పోస్టుల్లో 38 ఖాళీలే. వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖలో 662 పోస్టులకు 398 భర్తీకి నోచుకోలేదు. అనేకచోట్ల పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాలు అద్దె భవనాల్లో అరకొర వసతులు మధ్య కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వం ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లె, బస్తీ దవాఖానాలుగా మార్చినా ఆశించిన స్థాయిలో వైద్యమందటం లేదు.


వైరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సీహెచ్‌సీల పరిస్థితీ అంతంతే..

ఖమ్మం జిల్లాలో సత్తుపల్లి, పెనుబల్లి, మధిర, కల్లూరు, తిరుమలాయపాలెం, వైరా, నేలకొండపల్లిలో సీహెచ్‌సీలున్నాయి. సివిల్ సర్జన్లు 51మందికి 33మంది లేరు. డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టుల్లో 52కు 48, సివిల్ అసిస్టెంట్ సర్జన్లలో 154కు 113 పోస్టులు భర్తీచేయలేదు. స్టాఫ్ నర్సుల్లో 147కు 36మంది లేరు. హెడ్‌నర్సు పోస్టుల్లో 31కి 21 ఖాళీలున్నాయి. మిడ్‌వైఫరీ పదకొండు పోస్టులకు పదింటిని భర్తీ చేయాల్సి ఉంది. రేడియోగ్రాఫర్లు, ఫార్మసిస్టులు, ఫిజియోథెరపిస్టులు ఇలా అనేక విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉండటంతో రోగులకు ఆశించిన స్థాయిలో సేవలందటం లేదు.

దూరభారంతో సతమతం

భద్రాద్రి జిల్లాలో సగటున 17 గ్రామాలకు ఒక పీహెచ్‌సీ ఉండగా 5వేల మందికి ఒక ఆరోగ్య ఉపకేంద్రం సేవలందిస్తోంది. జనాభాకు అనుగుణంగా ఆసుపత్రుల సంఖ్య పెరగట్లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో దూరభారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ వైద్యసేవలను విస్తరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని 23 మండలాల్లో 29 పీహెచ్‌సీలుండగా కొత్తగా పదకొండు పీహెచ్‌సీలు ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. జిల్లాలో 240 ఆరోగ్య ఉపకేంద్రాలుండగా.. మరో 30 కేంద్రాలను ఏర్పాటుచేయటానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. మారుమూల ప్రాంతాలకు వైద్యసేవలు విస్తరించేలా ఇప్పటికే బైక్ అంబులెన్స్‌లు పదింటిని సిద్ధం చేశారు. వైద్యవృత్తిలో అనుభవం కలిగిన ఉద్యోగి ద్విచక్రవాహనంపై వెళ్లి పల్లెల్లో వైద్యమందించాల్సి ఉంటుంది. రూ. 2కోట్ల వ్యయంతో ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ వంటి అధునాతన రోగనిర్ధారణ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావటానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

వైద్యసేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వైద్య సదుపాయాలకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి ఐటీడీఏ పీఓ ద్వారా ఇటీవల ప్రభుత్వానికి నివేదించాం.

- భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ, భద్రాద్రి



అంగన్‌వాడీ.. ముస్తాబవుతుందండీ!

ఏన్కూరు, న్యూస్‌టుడే: పిల్లలను ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రాలను ముస్తాబు చేస్తున్నారు. చిన్నారులకు ఆహ్లాదం పంచటంతోపాటు చూడముచ్చటైన బొమ్మలతో వీటిని తీర్చిదిద్దుతున్నారు. గోడలే పాఠాలు బోధించేలా.. బొమ్మలు, చేతిరాతలతో ఔరా అనిపించేలా తయారు చేస్తున్నారు. తొలి విడతలో జిల్లాలో 65 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి ఆదర్శ అంగన్‌వాడీ పూర్వప్రాథమిక పాఠశాలలుగా పేరు పెట్టారు. కామేపల్లి ప్రాజెక్టు పరిధిలోని కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు మండలాల్లోని పది కేంద్రాలను ఎంపిక చేశారు. ఏన్కూరు మండలం జన్నారం, రాయమాధారంలో పనులు పూర్తయ్యాయి.

ఆకర్షణీయ చిత్రాలు

పాఠశాల ఆరంభంలో స్వాగతం పలుకుతూ అమ్మఒడితో చిత్రం, బయట గోడలపై పిల్లలు, పుస్తకాలతో ఉండే చిత్రాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. గోడలన్నీ విజ్ఞానాన్ని నింపే విధంగా జంతువులు, వాహనాలు, ఆటలు ఇలా తీరొక్క బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. పిల్లలకు ఆరోగ్యంపై చిన్నతనం నుంచి అవగాహన పెంచేలా చేతులు శుభ్రం చేసుకోవడం, కరచాలనం చేసే విధానం బొమ్మల రూపంలో చూపించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. తల్లులు, బాలింతలకు చైతన్యం కల్పించే రాతలు, ఆరోగ్యసూత్రాలు ఉన్నాయి. ఇలా అన్నీ గ్రామాల్లోనూ అమలుచేస్తే అంగన్‌వాడీ కేంద్రాలన్నీ కళకళలాడనున్నాయి. కామేపల్లి ప్రాజెక్టు పరిధిలోని కొన్ని ఆదర్శ కేంద్రాల్లో పనులు పూర్తయ్యాయని సీడీపీఓ దయామణి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. మిగిలినచోట సైతం త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చొరవ చూపుతామన్నారు.


జన్నారం అంగన్‌వాడీ పాఠశాలలో భవనం గోడలపై ఆరోగ్యసూత్రాలు, బొమ్మలు


రాయమాధారం.. ఆరుబయట గోడకు ఆకర్షణగా బొమ్మలు

తెల్లబంగారం.. నేలచూపులు

కొణిజర్ల, తల్లాడ, న్యూస్‌టుడే

పత్తి సాగుని నమ్ముకున్న రైతులకు ప్రతి ఏటా రుణభారం పెరుగుతూనే ఉంది. వానాకాలంలో మిగతా పంటల కంటే ఇదే కొంతవరకు సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు నమ్మి సాగు చేస్తున్నారు. గత మూడేళ్ల నుంచి వరస నష్టాలతో పత్తి రైతులు సతమతమవుతున్నారు. అధిక వర్షాలు.. పెట్టుబడుల భారం.. కూలీల కొరత.. దిగుబడులు తగ్గడంతో అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. సాగు కలిసిరాక పంట వేయడమే మానుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



పత్తితీతలో కూలీలు

పడిపోతున్న దిగుబడి

నాలుగేళ్ల క్రితం వరకు పత్తిలో ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. ఆ తర్వాత 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు పరిమితమవగా, రెండేళ్ల నుంచి 5 క్వింటాళ్ల వరకు మాత్రమే దిగుబడి వస్తోంది. ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి దెబ్బతిని 5 క్వింటాళ్లలోపే దిగుబడులు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు.. తెగుళ్ల కారణంగా దిగుబడులు గణనీయంగా తగ్గాయి. మరోవైపు పెట్టుబడులు ఆకాశాన్ని తాకగా, దిగుబడులు నేలచూపు చూస్తున్నాయి.

ఖమ్మం		భద్రాద్రి
1.99 లక్షలు	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	2.01 లక్షలు
1.09 లక్షలు	రైతుల సంఖ్య	1.10 లక్షలు

నష్టానికి కారణాలు ఇవీ?

★ తెగుళ్లను తట్టుకునే అధిక దిగుబడినిచ్చే విత్తనాలు లేకపోవడం ★ ఒక్కసారే కాయలు వచ్చి తక్కువ దిగుబడులు రావడం ★ పత్తిలో కలుపు, పత్తితీతలకు కూలీలు కొరత ★ తెగుళ్ల నివారణకు అధిక రసాయన మందుల పిచికారి ★ సేంద్రియ ఎరువులు లేక పూర్తిగా రసాయన ఎరువులపై ఆధారపడటం ★ వాతావరణ మార్పులతో అతివృష్టి లేదా అనావృష్టి పరిస్థితులు ★ సాగు వ్యయం భారీగా పెరిగి రాబడి రాకపోవడం

పత్తి సాగు.. ఎకరానికి ఖర్చు

దుక్కులు:	విత్తనాలు:	పాట్లు:	కూలీలు:
రూ.6,000	రూ.1,600	రూ.8,000	రూ.4,500


రసాయన మందులు:	రసాయన ఎరువులు:	మొత్తం ఖర్చు:
రూ.8,500	రూ.6,500	35,100

★ పత్తితీతకు ఎకరానికి రూ.5 వేలు ఖర్చు వస్తోంది. దానిని కూడా లెక్కలోకి తీసుకుంటే మొత్తం పెట్టుబడి సుమారు రూ.40 వేలు వస్తుంది)

దిగుబడి 5 క్వింటాళ్లకు బయట మార్కెటు ధర రూ.6 వేల ప్రకారం ఆదాయం రూ.30 వేలు

5 క్వింటాళ్లకు సీసీఐ మద్దతు ధర ప్రకారం ఆదాయం రూ.37,600

మిగులుబాటు లేదు: రేగళ్ల లక్ష్మణరావు, గంగదేవీపాడు, తల్లాడ మండలం



ఈ ఏడాది మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఎకరానికి రెండు క్వింటాళ్ల వరకు పత్తి తీసి రూ.5,800 చొప్పున విక్రయించాను. మరో క్వింటాల్ మాత్రమే వచ్చే అవకాశం ఉంది. అధిక వర్షాలతో పెట్టుబడులు రూ.35 వేల వరకు అయ్యాయి. పెట్టుబడులు కూడారాని పరిస్థితి నెలకొంది. కౌలు రైతులకు శ్రమకు తగ్గ ఫలితం దక్కదు.

పౌష్టికాభివృద్ధి..!

మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం

కూసుమంచి, న్యూస్‌టుడే

మహిళల ఆర్థికాభివృద్ధితోపాటు కుటుంబ సభ్యులకు పౌష్టికాహారాన్ని అందుబాటులో ఉంచే లక్ష్యంతో మహిళా శక్తి పథకం ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లాలో నాటుకోళ్ల పెంపకానికి ఊతమిస్తోంది. ప్రతి మండలానికి రెండు నాటుకోడి పిల్లలను అందుబాటులో ఉంచి ఎనిమిది వారాల వయసు దాటిన కోడి పిల్లలను స్వయం సహాయక సంఘాలకు సరఫరా చేయడం లక్ష్యంగా ప్రతి మండలానికి ఒక మదర్ యూనిట్‌ను స్థాపిస్తున్నారు. ఇప్పటికే కూసుమంచి మండలంలో యూనిట్‌ను స్థాపించారు. అన్ని మండలాల్లోనూ విస్తరణకు కార్యాచరణ చేపట్టారు.



కూసుమంచి మండలంలోని జుజ్జులరావుపేట మదర్ ఫారం యూనిట్‌లో నాటుకోడి పిల్లలు

కొనుగోలు మొదలు విక్రయం దాకా ఇలా..

1 నాటుకోళ్లలో ఎక్కువ రోజులపాటు గుడ్లు పెట్టే మేలురకం ఆసిల్, సోనాలి రకం కోళ్ల జాతులను ఎంపిక చేసుకుని కొనుగోలు చేస్తారు. 2వేల పిల్లలను ఇలా కొనుగోలు చేసి 'మదర్ ఫారం'లో పెంపకం చేపడతారు. ప్రతి మండలంలో ఆసక్తి ఉన్న గ్రామ సమాఖ్యల సహకారంతో 'మదర్ ఫారం' స్థాపిస్తారు. పిల్లల కొనుగోలు, దాణా తదితర అవసరాలకు మండల సమాఖ్య సీఐఎఫ్ ద్వారా రూ.3 లక్షలు రుణ సౌకర్యం కల్పిస్తుంది. ఎనిమిది వారాల్లో మూడుసార్లు వ్యాక్సిన్, ఒకసారి కొక్కెర నిర్మూలన ఇంజెక్షన్ ఇస్తారు.

3 మదర్ ఫారం నుంచి కొనుగోలు చేసిన కోడిపిల్లలను సభ్యులు తమ పెరట్లో పెంపకం చేపట్టాలి. ఈ కోళ్లు సుమారు 100 నుంచి 120 రోజులపాటు నిరంతరాయంగా గుడ్లు పెడతాయి. సభ్యులు స్వీయ వినియోగంతోపాటు ఆదాయ మార్గంగా విక్రయించుకుంటారు. కొన్నాళ్లకు కోళ్ల సంఖ్య పెరిగిన అనంతరం వాటిని విక్రయించుకుంటూ జీవనోపాధి పొందొచ్చు.

2 మదర్ ఫారంలో 8 నెలలపాటు పెరిగిన పిల్లలను మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు విక్రయిస్తారు. 30 నుంచి 50 పిల్లల వరకు సభ్యులకు అందిస్తారు. వాటి ఖరీదు, పోషణ నిమిత్తం రూ.7,500 చొప్పున రుణ సదుపాయం కల్పిస్తారు.

ఆదర్శంగా.. 'జుజ్జులరావుపేట'

కూసుమంచి మండలంలోని జుజ్జులరావుపేటలో శ్యామల స్వయం సహాయక సంఘం ద్వారా సభ్యురాలు బాలి రాణి ఏర్పాటుచేసిన మదర్ యూనిట్ ఆదర్శంగా నిలుస్తోంది. గతేడాది ప్రయోగాత్మకంగా ఇక్కడ చేపట్టిన పిల్లల పెంపకం ప్రక్రియలోనూ నిర్వాహకులు లాభం గడించారు. కేంద్రాన్ని ఇటీవల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పరిశీలించి నిర్వాహకురాలిని అభినందించారు. అన్ని మండలాల ఏపీఎంలు, మండల సమాఖ్య బాధ్యులు యూనిట్‌ను సందర్శించారు.

కంటికి రెప్పలా ఎనిమిది వారాలపాటు..

- బాలి రాణి, కేంద్రం నిర్వాహకురాలు




కోడిపిల్లలను 8 వారాల పాటు పెంపకం చేపడతాం. 8, 12, 18వ రోజుల్లో వ్యాక్సిన్ వేస్తాం. ఎనిమిది వారాల వయసులో ఒకసారి కొక్కెర నివారణ ఇంజెక్షన్ అందిస్తాం. మేలు రకమైన దాణాను కొనుగోలు చేసి తెచ్చి వాటికి వయస్సు ఆధారంగా అందిస్తున్నాం. కోళ్ల పెరుగుదలలో తొలి ఎనిమిది వారాలు కంటికి రెప్పలా కాపాడుకుంటాం.

ఆరు మండలాల్లో ఏర్పాటు

- డీపీఎం శ్రీనివాస్

జుజ్జులరావుపేటతోపాటు, జిల్లాలోని ముదిగొండ, ఖమ్మం గ్రామీణం, బోనకల్లు, సత్తుపల్లి, వేంసూరులో ఇప్పటికే 'మదర్ ఫారం' యూనిట్లు స్థాపించాం. మిగిలిన మండలాల్లోనూ కొద్ది రోజుల్లోనే యూనిట్లు ఏర్పాటు చేస్తాం. విజయవంతమైన నిర్వహణ ద్వారా ప్రతీ బ్యాచ్‌కు (60 రోజులు) కనీసం రూ.60-70 వేల ఆదాయం పొందే అవకాశం ఉంది.

ఉషోదయం వేళ.. ఆహ్లాద మేళా



బువ్వ కోసం అవ్వ పోరాటం



తల్లి పాల కోసం ఆరాటం



పని కోసం పయనం


మణుగూరు మండలం రేగులగండి గ్రామంలో ఉదయపు రేఖలు ముందుగా వాలుతాయి. మంచుతెరలు కూడా ముందుగానే ఆవిరవుతాయి. ఎందుకంటే ఈ గ్రామం అటవీప్రాంతంలోని గుట్టపై ఉంటుంది. మంగళవారం ఉదయం గ్రామంలోని జీవనవిధానం దృశ్యాలను 'న్యూస్‌టుడే' కెమెరాలో బంధించింది.

– మణుగూరు, న్యూస్‌టుడే

పైన వాయుమార్గం.. కింద ధూమశకటం

ఇదీ మణుగూరు మండలం కూనవరం వద్ద రైల్వే మార్గంపై నిర్మించిన ప్రొటెక్షన్ బ్రిడ్జ్. భారజల ప్లాంటుకు బొగ్గును రవాణా చేసే బై కేబుల్ ఏరియల్ రోప్ వే సిస్టం సరిగ్గా ఈ ప్రదేశంలోనే రైల్వే మార్గంపై పయనించి దాటుతుంది. దాంతో ఆ ప్రదేశంలో రైల్వే మార్గంపై ఈ ప్రొటెక్షన్ బ్రిడ్జ్‌ను కట్టారు. తలవని తలంపుగా రోప్‌వే తెగినా బక్కెట్లు కిందపడ్డా రైల్వే మార్గానికి కలిగే నష్టం, ప్రమాదం అంటూ ఏమీ ఉండబోదు. అవి ఆ ప్రొటెక్షన్ బ్రిడ్జ్ పైనే పడతాయి. సుమారు వంద అడుగుల పైగా పొడవుతో ఈ బ్రిడ్జ్‌ను రైల్వే మార్గంపై నిర్మించారు.

– మణుగూరు గ్రామీణం, న్యూస్‌టుడే



రాములోరికి ఘనంగా కల్యాణం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి మంగళవారం సుప్రభాతం పలికి ఆరాధించి అర్చన చేశారు. ఇక్కడ కొలువైన సీతారామలక్ష్మణులను దర్శించుకుంటే అంతా శుభమే సిద్ధిస్తుందని సుభాషించారు. నిత్య కల్యాణం గురించి వైదిక పెద్దలు ప్రవచిస్తుండగా దీనికి అనుగుణంగా క్రతువు నిర్వహించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక నిర్వహించారు. అనుబంధంగా ఉన్న ఆంజనేయుడికి అభిషేకం చేశారు. హనుమాన్‌చాలీసాను పారాయణం చేసి సుందరకాండను పఠించారు. భక్తులు సింధూరాన్ని నుదట ధరించి తమలపాకుల పూజ చేశారు. ధర్మ ప్రచారంలో భాగంగా కోనసీమ జిల్లా పలివెల గ్రామంలో సీతారామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. రామాలయం నుంచి వెళ్లిన రామరథంలోని విగ్రహాలకు ఆలయ అర్చకులు భద్రాచలం సంప్రదాయంలో కల్యాణ వేడుక చేపట్టారు.

బ్యాంకు ఉద్యోగాలకు శిక్షణ

భద్రాచలం, న్యూస్‌టుడే: బ్యాంకు పీఓ, క్లర్ పోస్టులను పొందేందుకు వీలుగా గిరిజన సంక్షేమశాఖ ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించిందని ఐటీడీఏ పీఓ రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 60 రోజులపాటు శిక్షణ ఉంటుందని ఇందుకు 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. ఎంపికైన వారికి స్టడీ మెటీరియల్, ఉపకార వేతనం అందించనున్నట్లు వెల్లడించారు.

డీసీసీబీ ఖమ్మం గ్రామీణ బ్రాంచిలో అక్రమాలపై విచారణకు ఆదేశం

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఖమ్మం గ్రామీణ బ్యాంకులో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలపై ప్రధాన కార్యాలయం డీజీఎం సర్వేశ్వర్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఈమేరకు ఆయన బ్యాంకులోని పలు దస్త్రాలను పరిశీలించారు. గతంలో ఇక్కడ పని చేసిన బ్యాంకు మేనేజర్ తన బంధువులు, ఇతరులకు సరైన డాక్యుమెంట్లు లేకుండానే కోట్ల రుణాలు మంజూరు చేశారని, అదే విధంగా నాబార్డు సబ్సిడీ రుణాలను సైతం సంబంధిత రైతులకు చెల్లించకుండా ఇతర ఖాతాలకు మళ్లించి స్వాహా చేసినట్లు కొంతమంది ఫిర్యాదు జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. తాను పని చేసిన కాలంలో పలు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇతని అక్రమాలపై ప్రాథమిక విచారణ చేసి నివేదిక అందాల్సిందిగా జిల్లా అధికారులు ఆదేశించారు. భూమిలేని వారికి రుణాలు మంజూరు చేయటం, పీఎంజీ రుణాల్లో అక్రమాలకు పాల్పడటం లాంటి అంశాలపై ఇప్పుడు విచారణ జరుగుతోంది.

అంబులెన్స్, లారీ ఢీకొని ఆరుగురికి గాయాలు

తల్లాడ, న్యూస్‌టుడే: ఓ ప్రైవేట్ అంబులెన్స్, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదం తల్లాడ బస్టాండ్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం మునుకుళ్ల గ్రామానికి చెందిన సీహెచ్ కనకమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో తిరువూరు నుంచి ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తున్నారు. తల్లాడ బస్టాండ్ సమీపంలో రహదారి పక్కన నిలిపి ఉంచిన ఓ లారీని తప్పించే క్రమంలో డివైడర్ దాటి ఎదురుగా వస్తున్న మరో లారీని అంబులెన్స్ ఢీకొంది. ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న డ్రైవర్ ఎన్.ప్రభాకర్, గ్రామీణ వైద్యుడు డి.గోపి, సీహెచ్.కోటయ్య, కనకమ్మ, కృష్ణమ్మ, ఆర్.కృష్ణవేణి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను తల్లాడ, ఏన్కూరు 108 వాహనాల్లో ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లాడ ఎస్సై బి.కొండలరావు ఘటనా స్థలానికి చేరుకొని రహదారిపై ఉన్న అంబులెన్స్‌ను జేసీబీ సాయంతో పక్కకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.



అంబులెన్స్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్



ప్రమాదంలో గాయపడ్డ మహిళ

ఉపాధి కోసం వచ్చి అనంతలోకాలకు..

◆ రోడ్డు ప్రమాదంలో ఖమ్మంవాసి మృతి

గాండ్లపేట్(మోర్తాడ్), న్యూస్‌టుడే: ఉపాధి కోసం వచ్చిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన మోర్తాడ్ మండలం గాండ్లపేట్ 63వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై విక్రమ్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకొడవకు చెందిన కాకర్ల గోవింద్, లక్ష్మి దంపతులు ఉపాధి నిమిత్తం సోమవారం మోర్తాడ్‌కు వచ్చి స్థానికంగా ఓ ఇంట్లో అద్దెకు దిగారు. రాత్రి బయటకు వెళ్లిన గోవింద్ అద్దెకు తీసుకున్న ఇంటిని మర్చిపోయి 63వ జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. సమాచారమందుకున్న పోలీసులు క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గోవింద్ మంగళవారం మృతిచెందారు. అతడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిబంధనల మేరకు బాణసంచా దుకాణాలు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిబంధనల మేరకు బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పొడిశెట్టి శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రజలు సంతోషంగా దీపావళి పండుగ నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. 31న దీపావళి పండుగ రోజు పగలు, రాత్రి స్పెషలిస్ట్ వైద్యులు ఆసుపత్రుల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా సహాయం కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్ 1077కు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. ఎస్బీ ఏసీపీ సాంబరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జకీరుల్లా, డీఎంహెచ్ఓ సుబ్బారావు పాల్గొన్నారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్త పత్తి	6,000	7,000	6,700
పెసలు	4,200	7,100	6,600
మొక్కజొన్నలు	2,251	2,251	2,251
ఏసీ ఎండుమిరప	9,500	19,000	16,500
ఎండుమిరప	8,500	17,500	13,500
ఏసీతాలుమిరప	8,200	8,200	8,200

ఉరి వేసుకొని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

కూసుమంచి, న్యూస్‌టుడే: కూసుమంచి మండలంలోని గంగబండతండాకు చెందిన వడ్తియా చైతన్య(19) అనే డిగ్రీ విద్యార్థిని గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు మిరప క్షేత్రంలో పనులు చేస్తున్న సమయంలో ఒంటరిగా ఉన్న చైతన్య ఇంట్లో పంకాకు ఉరి వేసుకుంది. వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఇంటి తలుపులు లోపల నుంచి వేసి ఉండటంతో పాటు విద్యార్థిని పలకకపోవడంతో తలుపులను ధ్వంసం చేసి లోనికి వెళ్లే సరికి కుమార్తె ఉరి వేసుకొని కన్పించింది. తనికెళ్లలోని గిరిజన బాలికల గురుకుల కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని దసరా సెలవులకు వచ్చి ఇంట్లోనే ఉంటోంది. అనారోగ్యం కారణంతో కళాశాలకు వెళ్లలేదని, అదే కారణంతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. ఎస్ఐ నాగరాజు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం నేలకొండపల్లి సీహెచ్‌సీకి తరలించారు.



వడ్తియా చైతన్య

సెల్‌ఫోన్ ధర చెల్లించండి

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ షాపింగ్‌లో కొనుగోలు చేసిన సెల్‌ఫోన్ ధర రూ.29,999లను ఫిర్యాదుదారుకు తిరిగి చెల్లించాలని అమెజాన్ కంపెనీని ఆదేశిస్తూ ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు చెప్పింది. కేసు వివరాల ప్రకారం.. ఖమ్మం నగరానికి చెందిన జి.కృష్ణారెడ్డి 2023 మార్చి 28న అమెజాన్ సైట్‌లో రూ.29,999లకు ఐకూ కంపెనీ సెల్‌ఫోన్ కొనుగోలు చేశారు. దాన్ని తాను సూచించిన అడ్రస్‌లో అందించకుండానే డెలివరీ చేసినట్లు ఆన్‌లైన్ స్టేటస్ చూపించడంతో కంపెనీ ప్రతినిధులను సంప్రదించారు. వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఫిర్యాదుదారు జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేశారు. ఓటీపీ విధానం ద్వారా వస్తువులను భద్రంగా వినియోగదారులకు అందచేస్తామని, సెల్‌ఫోన్‌ను కొనుగోలుదారు సూచించిన చిరునామాలో అందజేశామని అమెజాన్ కంపెనీ వాదించింది. ఇరుపక్షాల వాదనలు విన్న కమిషన్ ఛైర్‌పర్సన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత అమెజాన్ ఆన్‌లైన్ సంస్థ సేవా లోపాన్ని నిర్ధారించారు. సెల్‌ఫోన్ ధర రూ.29,999తోపాటు ఫిర్యాదుదారు మనో వేదనకు గురిచేసినందుకు రూ.10 వేలు, కేసు ఖర్చుల కింద మరో రూ.10 వేలు చెల్లించాలని ఆదేశించారు.

తనయుడి అంత్యక్రియలకు హాజరై తనువు చాలించిన తల్లి

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: కుమారుడు మృతి చెందడంతో కడసారి చూసేందుకు వచ్చిన తల్లి తనువు చాలించిన విషాద ఘటన కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన పసుపులేటి నరేందర్ గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. తల్లి సులోచన(80) మరో కుమారుడు కృష్ణ కుటుంబంతో కలిసి ఏపీలోని వైజాగ్‌లో ఉంటున్నారు. మంగళవారం ఇల్లెందుకు వచ్చిన ఆమె అచేతన స్థితిలో ఉన్న కుమారుడిని చూసి తల్లి హృదయం తట్టుకోలేకపోయింది. నరేందర్ అంత్యక్రియలు ప్రారంభమవుతుండగా ఏడుస్తూ కుప్పకూలారు. కుటుంబ సభ్యులు సీపీఆర్ చేసి ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలకు తరలించిన కొంత సేపటికే మృతి చెందింది. కుమారుడి అంత్యక్రియలు జరగ్గా బుధవారం సులోచన అంత్యక్రియలకు కుటుంబ సభ్యులు, బంధువులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా సీతారామటాకీసు వెనుక ఖాసీ ఆశీష్‌అసిర్ ఖానాలో మొహరం వేడుకను వీరి కుటుంబ సభ్యులు మూడు తరాలుగా నిర్వహిస్తున్నారు. ఆ వేడుకకు నాలుగు నెలల క్రితం కుటుంబ సభ్యులంతా కలిశారు.




సులోచన

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపు.. దుండగుడి అరెస్టు

దామెర, న్యూస్‌టుడే: డబ్బు కోసం డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన దుండగుడిని అరెస్టు చేసినట్లు పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్ తెలిపారు. దామెర పోలీస్‌స్టేషన్‌లో ఆయన మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తదనంతరం ఎన్ని పనులు చేసినా ఎక్కువ డబ్బు రాకపోవడంతో ఖమ్మం శివారులో పలు కిరాణా దుకాణాలకు వెళ్లి మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. డమ్మీ పిస్టల్‌తో బెదిరిస్తే మరింత డబ్బు వసూలు చేయవచ్చునని భావించి హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొన్నాడు. అతడిపై ఖమ్మం జిల్లా పరిధిలో పదికి పైగా కేసులు నమోదయ్యాయి. వెంకటేశ్వర్లు రూ.800తో మరో నకిలీ తుపాకీ కొన్నాడు. వరంగల్‌లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈనెల 21న ఖమ్మం నుంచి రైలులో అక్కడికి చేరుకున్నాడు. అర్ధరాత్రి వేళ ఊరుగొండకు వెళ్లాడు. అక్కడ కిరాణ దుకాణం యజమాని కందికొండ సంపత్‌ను నిద్రలేపి సిగరెట్ తీసుకుంటున్న క్రమంలో డమ్మీ పిస్టల్ చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. లేవని చెప్పిన సంపత్‌ను కిందపడేసి గల్లా పెట్టెలో రూ.2వేలు తీసుకొని, తాను నక్సలైట్‌నని, ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈక్రమంలో సంపత్ అతడిని గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. స్థానికులు గుమిగూడి వెంకటేశ్వర్లును బంధించి డమ్మీ పిస్టల్‌ను లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

రైలు మార్గం.. ఎటు వైపో..!

రామాలయం అభివృద్ధి పనులపై చిగురిస్తున్న ఆశలు



భద్రాచలం



భద్రాచలం పట్టణం వద్ద రైలు మార్గం ఎటు వైపున ఉంటుందోనన్న చర్చ కొద్ది రోజులుగా జోరుగా సాగుతోంది. ఇక్కడి పరిస్థితుల ప్రకారం స్థానిక కొర్రాజులగుట్టకు అవతల నుంచి ట్రాక్ నిర్మించే వీలుందని భావిస్తున్నారు. ఇది వీలుకాని పక్షంలో గతంలో చేసిన సర్వే ప్రకారం భద్రాచలం శివారున అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం మేడువాయి గ్రామం గుండా గోదావరి మీదుగా బూర్గంపాడు మండలం పాండురంగాపురం వరకు రైల్వే లైన్ ఏర్పడే వీలుందని అంచనా వేస్తున్నారు.

– భద్రాచలం, న్యూస్‌టుడే

ఒడిశాలోని మల్కనగిరి నుంచి భద్రాచలం మీదుగా పాండురంగాపురం వరకు 173.61 కి.మీ. మార్గం నిర్మాణానికి కేంద్రం రూ.3591.76 కోట్లను రెండు నెలల కిందట మంజూరు చేసింది. ఇందులో భద్రాచలం నుంచి పాండురంగాపురం వరకు 20 కి.మీ. ఉండగా గోదావరిపై 2 కి.మీ పొడవైన భారీ వంతెన ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు మరో ఐదారేళ్లలో పూర్తి చేయాలని నిర్ణయించడంతో.. స్థల పరిశీలనకు ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు దృష్టి సారించనున్నాయి. స్థల సేకరణకు రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం రావాల్సి ఉంది. మొత్తంగా 846 ఎకరాలను సేకరించాల్సి ఉండగా భద్రాచలం రెవెన్యూ డివిజన్ పరిధిలో తక్కువ భూమి సరిపోతుందని అంచనా.

ఇక్కడి నుంచే ప్రారంభిస్తే బాగు..

ఒడిశా నుంచి పనులు ప్రారంభిస్తే ఇక్కడకు వచ్చేసరికి దీర్ఘకాలం పట్టే వీలుంది. వేర్వేరు ప్యాకేజీల ప్రకారం పనులు చేపట్టినా ఈ ప్రాంతానికి తొలి ప్రాధాన్యతను ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం ఈ ప్రాంతంలో వ్యక్తమవుతోంది. పాండురంగాపురం రైల్వే స్టేషన్ కొత్తగూడెం-మణుగూరు మధ్యలో ఉంది. పాండురంగాపురం వద్ద నుంచి పనులు ఆరంభిస్తే భద్రాచలం వరకు నూతనమార్గం మూడేళ్లలోనే అందుబాటులోకి వస్తుందని అంచనా. ఇదే జరిగితే రామాలయానికి వచ్చే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది. దేశం నలుమూలల నుంచి రాకపోకలు పెరుగుతాయి. ఈ ఏడాది శ్రీరామ నవమి సమయంలో గోదావరిపై వాహనాల రాకపోకలకు రెండో వంతెన అందుబాటులోకి వచ్చింది. అప్పటి నుంచి ట్రాఫిక్ చిక్కులు తొలగాయి. భవిష్యత్తులో కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పడుతుందన్న ఆశ జిల్లా వాసుల్లో ఉంది. ఇప్పటికే ఏడాదికి కోటి మంది భక్తులు రామాలయానికి వస్తున్నారన్నది అంచనా. రామయ్య చెంతకు రైల్వే లైను వస్తే ఈ ప్రాంతానికి మరింత అభివృద్ధి అవకాశం అందినట్లే.

అన్నీ మంచి శకునాలే..

★ ఆలయం వద్ద మాడవీధుల విస్తరణకు స్థల సేకరణ చేస్తున్నారు. కొందరు ఇంటి యజమానులు స్టే తెచ్చుకునే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ వారిని అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు.

★ సర్వే పూర్తయితే మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భారీ నిధులతో కోవెలను అభివృద్ధి చేయనున్నారు. మరో వైపున ప్రసాద్ పథకం ద్వారా రూ.42 కోట్లతో ఆలయ పరిసరాలలో పనులు కొనసాగుతున్నాయి.

★ కూనవరం రోడ్డులోని శిశుమందిర్ సమీపంలో కరకట్ట నిర్మాణ పనులు ఇంకొంత కాలంలో పూర్తి కానున్నాయి. ఇది పూర్తయితే ఈ ప్రాంతంలోని లోతట్టు ప్రాంతాలకు ముంపు ఉండదు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కమాండెంట్ ఛటర్జీ

'అన్ని దానాల్లో రక్తదానం చాలా గొప్పది'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: అన్ని దానాల్లో రక్తదానం చాలా గొప్పదని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ ఛటర్జీ అన్నారు. బెటాలియన్‌లో మంగళవారం పోలీస్ ఫ్లాగ్‌డే దినోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కమాండెంట్ ప్రారంభించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్డీ రంగారెడ్డి, సీహెచ్‌సీ వైద్యుడు రాజేశ్ పాల్గొన్నారు.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

రహదారి నిర్మాణాన్ని పరిశీలించిన ఈఈ

చింతకాని, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నాగులవంచ - బోనకల్లు మండలం చొప్పకట్లపాలెం వరకూ నూతనంగా నిర్మించ తలపెట్టిన రహదారి ప్రాంతాన్ని పంచాయతీరాజ్‌శాఖ ఈఈ వెంకటరెడ్డి మంగళవారం పరిశీలించారు. దీని నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. ఆయన వెంట డీఈ కుతుంబాక శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు అంబటి వెంకటేశ్వరరావు ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: తిమ్మారావుపేట రెండు పడక గదుల ఇళ్ల వద్ద చేతిపంపు ఆరు నెలలుగా పని చేయడం లేదు. నాలుగు గ్రామాల ప్రజలు ఈ పంపును తాగునీటి పంపుగా ఉపయోగిస్తున్నారు. **- అశోక్**

సమాధానం: మా దృష్టికి రాలేదు. వెంటనే మరమ్మతులు చేయిస్తాం. **ఎస్.రమేశ్ ఎంపీడీవో**

– ఏన్కూరు, న్యూస్‌టుడే

పైపులైన్ల ఏర్పాటు

స్పందనకు వందనం

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరు పట్టణ పరిధిలోని మధిర వీధిలో మురుగు నీరు సాగర్ కాల్వలో కలుస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని 'మేమున్నాం మీకు తోడుగా'లో శనివారం ప్రచురించిన కథనానికి స్పందన లభించింది. పంచాయతీ కార్యదర్శి నందిశెట్టి నాగేశ్వరరావు జేసీబీ సాయంతో ప్రత్యేకంగా కాలువ, పైపులను ఏర్పాటు చేసి మంగళవారం శాశ్వత పరిష్కార చర్యలు తీసుకున్నారు.

పచ్చని పొలాలు.. రెండు భాగాలు

గ్రీన్‌ఫీల్డ్ రహదారిలో అండర్‌పాస్‌ల కోసం రైతుల వినతులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు కూచిపూడి వెంకటేశ్వర్లు. చింతకాని మండలం కొదుమూరు గ్రామం. ఉన్న మూడు ఎకరాల్లో ఎకరం గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంలో పోయింది. మిగిలిన రెండెకరాలను రోడ్డు రెండుగా చేసింది. రెండోవైపు ఉన్న పొలానికి వెళ్లాలంటే ఎనిమిది కిలోమీటర్లు ప్రయాణించాలి. ఇది ఈ ఒక్క రైతు సమస్య మాత్రమే కాదు..



★ కొణిజర్ల మండలం చిన్నగోపతికి చెందిన బండారు నాగులుకు గ్రీన్‌ఫీల్డు రహదారికి ఓవైపు రెండు ఎకరాలు, రెండోవైపు మూడెకరాల భూమి ఉంది. రెండో వైపు వెళ్లాలంటే నాలుగు కి.మీ. దూరం ప్రయాణించాలి. సర్వీసు రోడ్డు లేక మిగతా రైతులు పొలాల్లో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అన్ని రోజులూ ఇది సాధ్యం కాదు.

★ తల్లాడ మండలం కేశవాపురానికి చెందిన గుంటుపల్లి నర్సింహారావు 2.1 ఎకరాల్లో ఎకరం కోల్పోయారు. మిగిలిన ఎకరం ఓ పక్క, పది కుంటలు మరోవైపు అయ్యాయి. చుట్టూతిరిగి ఆ వైపు వెళ్లే అవస్థ పడలేక పది కుంటల భూమిని పడావుగా ఉంచారు.

★ రామానుజవరం గ్రామానికి చెందిన శీలం రమణారెడ్డికి అయిదెకరాలుంది. 30 కుంటలు నిర్మాణంలోపోగా మిగిలిన 4.1 ఎకరాలు రెండు ముక్కలైంది. 2.5 కి.మీ. ప్రయాణిస్తేనే రెండో పక్కకు వెళ్లగలిగేది.

★ వేంసూరు మండలం లింగపాలెం గ్రామంలో నరుకుళ్ల భాస్కర్‌రావు, తుమ్మలపల్లి కేశవరావు పంట భూముల మధ్య నుంచి హైవే వెళ్తోంది. వీరిదీ ఇదే పరిస్థితి.

డొంక రోడ్డు కనుమరుగు

చింతకాని మండలం వందనం- కొదుమూరు మధ్య దశాబ్దాలుగా ఉన్న డొంక రహదారి కనుమరుగైంది. వందనం నుంచి పడకల సమాయం నుంచి కొదుమూరు శివారు వరకూ ఉండే ఈ మార్గం నుంచే 145 ఎకరాలకు చెందిన 350 మంది రైతులు పొలాలకు వెళ్తుంటారు. హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, అరకలు, పశువులూ వెళ్తుంటాయి. గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణంలో అండర్ పాస్‌లు, అప్రోచ్ రహదారులను ఏర్పాటు చేయకపోవటంతో రైతులు నిత్యం 8 కి.మీ. తిరిగి పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి. వంతెన ఏర్పాటుచేస్తే సౌలభ్యంగా ఉంటుంది.

– చింతకాని, న్యూస్‌టుడే



చింతకాని: వందనం- కొదుమూరు డొంక రహదారి

అన్నదాతల కష్టాలు

కొణిజర్ల, న్యూస్‌టుడే

వైరా, కొణిజర్ల మండలాల్లో గ్రీన్‌ఫీల్డు రహదారితో పలువురు అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి రెండో పక్క వెళ్లేందుకు కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. కొణిజర్ల మండలంలోని చిన్నగోపతి, వైరా మండలంలో ఏడు గ్రామాల రైతుల పొలాలు గ్రీన్‌ఫీల్డ్ పక్కన ఉన్నాయి. వీరంతా పొలాలకు వెళ్లాలంటే రహదారిని దాటలేక నాలుగు కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోంది. భూసేకరణ సమయంలో సర్వీసు రహదారి వస్తుందని ఆశపడ్డా నిరాశే మిగిలింది.



లక్ష్మీపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ రహదారి అండర్ పాసింగ్

ఎక్కడెక్కడ సమస్య?

కొణిజర్ల: చిన్నగోపతి, అనంతారం, బొట్లకుంట, పెద్దగోపతి, గోపవరం, పెద్దమునగాల, చిన్నమునగాల, దుద్దెపూడి.
వైరా: వైరా, సోమవరం, గండగలపాడు, లక్ష్మీపురం, స్టేజి పినపాక, సిరిపురం, ముసలిమడుగు.

ఇబ్బందిపడే రైతులు	రెండు మండలాల్లో పంటల విస్తీర్ణం: సుమారు
కొణిజర్ల: 1,300	7,500 ఎకరాలు
వైరా: 1,050	

450 మంది రైతులు..

మండలంలోని పినపాక, రామానుజవరం, కేశ్వాపురం, లక్ష్మీపురం గ్రామాల మీదుగా రహదారి వెళ్తోంది. సుమారు 450మంది రైతులకు చెందిన 1200 ఎకరాల విస్తీర్ణం రహదారికి రెండు వైపులా ఉన్నది. ఓ పక్క నుంచి రెండో వైపు ఉన్న పొలానికి వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులు చేసేటప్పుడు, పంటల ఉత్పత్తుల సమయంలో సుదూరం వెళ్లాల్సిన పరిస్థితి.

– తల్లాడ, న్యూస్‌టుడే

సమస్యకు పరిష్కారమెన్నడో?

సదాశివునిపాలెంలో సర్వీస్ రోడ్డు సమస్యపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ శివారు నుంచి రోడ్డు నిర్మాణ పనులు సాగుతుండగా అండర్ పాస్‌లు తక్కువ ఎత్తులో నిర్మించడంతో సమస్య తలెత్తింది. రోడ్డుకు అవతలి వైపు తుంబూరు, సదాశివునిపాలెం రైతుల భూములున్నాయి. వేంసూరు మండలం భీమవరం రైతులకు భూములున్నాయి. సదాశివునిపాలెం నుంచి కందుకూరు వెళ్లే రోడ్డులో, తుంబూరు వెళ్లే రోడ్డులో, వ్యవసాయ భూముల్లోకి వెళ్లే దారిలో అండర్ పాస్‌ల ఎత్తు కేవలం ఎనిమిది అడుగులు ఉండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట ఉత్పత్తులను తీసుకరావాలన్నా, వరికోత యంత్రాలు వెళ్లాలన్నా ఇబ్బందవుతోందని వాపోతున్నారు. ఎత్తు పెంచడం సాధ్యంకాని పక్షంలో కనీసం సదాశివునిపాలెం, భీమవరం మధ్యలోని పెట్రోల్ బంక్ పక్కనుంచి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ అంశంపై ఉన్నతాధికారులకు విన్నవించారు. – సత్తుపల్లి, న్యూస్‌టుడే



సదాశివునిపాలెంలో తక్కువ ఎత్తులో అండర్ పాస్

'రైతుల, స్థానికుల అభ్యంతరాల మేరకు ప్యాకేజీ 1లో 17, ప్యాకేజీ 2లో 14, మూడులో 14 అదనపు అండర్ పాస్ వంతెనలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు వచ్చాయి. జాతీయ రహదారుల నిబంధనల ప్రకారం రెండు కి.మీ. దూరంలో ఒక పాస్ లేక ఓవర్ బ్రిడ్జి ఉండాలి. దేవరపల్లి రహదారిలో కిలోమీటరు పరిధిలో అయిదారు ఏర్పాటు చేస్తున్నాం. ఏమన్నా అభ్యంతరాలుంటే పరిశీలిస్తాం.'

- దివ్య, గ్రీన్‌ఫీల్డ్ రహదారి టెక్నికల్ మేనేజర్

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక మండల వనరుల కేంద్రం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోడిగుడ్ల బిల్లులను విడుదల చేయాలని, ఎన్నికల హామీ నెరవేరుస్తూ కార్మికులకు నెలకు రూ.10వేల వేతనాలను అందించాలని డిమాండ్ చేశారు. ఎంఈఓ ఎన్.రాజేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి గల్లంతు



వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లి కట్లేరులో యువకుడు గల్లంతైన ఘటన మామునూరులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై కె.వెంకటేష్ తెలిపిన ప్రకారం. గంతాల వెంకటేశ్వరరావు(30) చేపల వేటకు వెళ్లి కట్లేరులోని చెక్‌డ్యాం వద్ద గల్లంతయ్యాడు. పోలీసులు రెస్క్యూ బృందంతో గాలిస్తున్నారు. వెంకటేశ్వరరావుకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై సమీక్ష

కల్లూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ శాసనమండలి ఓటరు నమోదు కార్యక్రమాన్ని డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో ఆర్డీఓ రాజేందర్‌గౌడ్ మంగళవారం చరవాణిలో సమీక్షించారు. ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. తహసీల్దార్లు ఓటరు నమోదు దరఖాస్తుల విచారణ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.

ఐఎన్‌టీయూసీ మండలాధ్యక్షుడిగా గోవిందరావు



చింతకాని, న్యూస్‌టుడే: ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా రామకృష్ణాపురం మాజీ సర్పంచి తిరుపతి గోవిందరావు ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మిరియాల నర్సింహారావు, అంజయ్య, వీరభద్రం, కొండలరావు, రమేశ్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ముదిగొండ, న్యూస్‌టుడే: రైతునేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర అన్నారు. మాధాపురం రైతువేదికలో మంగళవారం మాట్లాడారు. వరి, పత్తి పంటలో ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఏఓ నారాయణ, ఏఈఓలు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం కార్యవర్గ సభ్యునిగా ఆశీర్వాదం



తల్లాడ, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పినపాక గ్రామానికి చెందిన మోదుగు ఆశీర్వాదం నియమితులయ్యారు. మంగళవారం ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఛైర్మన్ చీమ శ్రీనివాస్ నుంచి నియామక పత్రాలను అందుకున్నారు.

గురుకులాల్లో క్రమశిక్షణతో విద్య

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: గురుకులాల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య అందిస్తున్నామని కృష్ణాపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రేగండ్ల శ్రావణి పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

బోనకల్లు, న్యూస్‌టుడే: బోనకల్లు, ముష్టికుంట్లలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్ని ఎంపీడీవో రమాదేవి, ఎంఈవో పుల్లయ్య మంగళవారం పరిశీలించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన రమాదేవి మొదటిగా పాఠశాలల్లోని ఏపీపీ పనుల్ని పరిశీలించారు. ఐకేపీ ఏపీఎం పద్మలత పాల్గొన్నారు.

సీపీఎం కార్యకర్తల సమావేశం

కారేపల్లి, న్యూస్‌టుడే: ఉసిరికాయలపల్లిలో దాసరి మల్లయ్య అధ్యక్షతన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడారు. మండల కార్యదర్శి నరేంద్ర, మాజీ సర్పంచి బన్సీలాల్, వజ్జా రామారావు పాల్గొన్నారు.

చీరల అందజేత

కారేపల్లి, న్యూస్‌టుడే: కారేపల్లిలో పేదలైన 50 కుటుంబాల మహిళలకు భారాస మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్ చీరలను మంగళవారం పంపిణీ చేశారు. సోమందుల రాములు, ఖలీలుల్లాఖాన్ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో వసతులు కల్పించాలి

వైరా, న్యూస్‌టుడే: విద్యావ్యవస్థలో వసతులు కల్పించే అంశంపై ప్రభుత్వం దృష్టిసారించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు పేర్కొన్నారు. వైరాలోని బోడేపూడి భవన్‌లో మంగళవారం మాట్లాడారు. బొంతు సమత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్టడీసర్కిల్ వ్యవస్థాపక సభ్యుడు చంద్రశేఖర్, సుధాకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణంపై ఫిర్యాదు

చింతకాని, న్యూస్‌టుడే: గాంధీనగర్‌లో ఓ ప్రైవేటు సెల్‌ఫోన్ కంపెనీ టవర్ ఏర్పాటుపై గ్రామస్థులు కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీని నిర్మాణం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని వారు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ అనంతరాజు టవర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు.

కుమురం భీం జయంతి

సత్తుపల్లి: సత్తుపల్లిలో కుమురం భీం జయంతిని మంగళవారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. గోవర్ధన్, సూరిబాబు, బాబురావు, కిషోర్, నరేశ్ పాల్గొన్నారు.

వెదుళ్ల చెరువు సర్వే

తల్లాడ, న్యూస్‌టుడే: వెదుళ్ల చెరువు పూర్తి నీటినిల్వ సామర్థ్యం నిర్ధారణ కోసం మంగళవారం సర్వే చేపట్టారు. చెరువు లోతట్టు విస్తీర్ణం 113 ఎకరాలకు అనుగుణంగా ఎఫ్‌టీఎల్ నిర్ధారించేందుకు ఖమ్మం భూసర్వే విభాగం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ధర్మారావు ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. మధ్యాహ్నం వర్షం రావడంతో అసంపూర్తిగా నిలిపివేశారు. ఏఈ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ భాస్కర్, సర్వేయర్ భరత్ పాల్గొన్నారు.

రోడ్డు కోతతో.. తప్పని తిప్పలు



సిరిపురం - రొంపిమళ్ల రహదారి వరదలకు కోతకు గురైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం రొంపిమళ్ల, మల్లారం, రామచంద్రాపురం, ఆంధ్రాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నెమలి వెళ్లే ప్రధాన రహదారి. రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. కోతకు గురైన రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు కాగానే చేయిస్తామని ఏఈ రాంబాబు తెలిపారు.

– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

కోతుల కొట్లాట... జనం ఊగిసలాట



ఏన్కూరులో వందకుపైగా కోతుల గుంపు మంగళవారం మధ్యాహ్నం గంటపాటు నువ్వానేనా అనే విధంగా దాడి చేసుకున్నాయి. ఇదంతా పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నడిరోడ్డుపై కావడం విశేషం. వాహనాలు, బాటసారులు కూడా ముందుకు వెళ్లకుండా భయానకం సృష్టించాయి. కేజీబీవీ పాఠశాల పక్కన రేపల్లెవాడ రహదారిలో రెండు వర్గాల కోతులకు ఘర్షణ ఆరంభమైంది. అక్కడ నుంచి ప్రధాన రహదారి వరకు గుంపుగా పోటీపడుతూ వచ్చాయి. ఒక్కసారిగా వందకు పైగా కోతుల గుంపును చూసిన జనం ఆశ్చర్యపోయారు. రాకపోకల దృశ్యాలను 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. – ఏన్కూరు, న్యూస్‌టుడే

శిక్షణ అధికారుల బృందం క్షేత్రస్థాయి పర్యటన



అంగన్‌వాడీ కేంద్రంలో నమూనా ఇంటిని అందిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

కారేపల్లి, న్యూస్‌టుడే: ఆల్యాతండాలో శిక్షణ కలెక్టర్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఈఎస్, ఐఎఫ్ఎస్ అల్తమాష్ గాజి వైభవ్‌మీనా, అనితామీనా, తేజస్విని, విపుల సింగాల్ అధికారుల బృందం మంగళవారం ఐకేపీ, అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఆయా శాఖల్లో జరుగుతున్న పనులు, స్థితిగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలు, వసూళ్ల విషయంపై క్షేత్రస్థాయిలో దస్త్రాల నిర్వహణ, ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ప్రభుత్వం

వైరా, ఏన్కూరు, కారేపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే అన్ని హామీలను అమలు చేస్తూ పేదలకు చేరువయ్యామన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ ఉపాధ్యక్షుడు బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, బొల్ల గంగారావు, మట్టూరి కృష్ణారావు పాల్గొన్నారు. ★ ఏన్కూరు మండలం రాయమాదారం సమీపంలో ఇరుకు వంతెనతో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. మాజీ సర్పంచి ముక్తి లక్ష్మీనారాయణ, గ్రామస్థులు నన్నేఖాన్, గౌస్‌ఖాన్, జక్కంపూడి శ్రీనివాసరావు, జహంగీర్, వీరూనాయక్, మోహన్‌రావు, కృష్ణారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ★ కారేపల్లిలో ఎస్సీ శ్మశానవాటికకు సీసీ రహదారి ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు మేదరి టోని, ఆదెర్ల రాములు మంగళవారం వినతిపత్రం అందించారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, బొర్రా రాజశేఖర్

అర్హులకు న్యాయం చేయాలి

చింతకాని, న్యూస్‌టుడే: ఇందిరమ్మ కమిటీలను రాజకీయాలకతీతంగా వేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. చింతకానిలో పార్టీ మండల కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేస్తేనే అర్హులకు న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. పొన్నం వెంకటేశ్వరరావు, బండి రమేశ్, కోటేశ్వరరావు, గోపాలరావు, జానకిరాములు, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

'పుల్లమ్మ మృతి తెదేపాకు తీరనిలోటు'

మధిర, న్యూస్‌టుడే: మధిర పట్టణ టీడీపీ శాఖ ఉపాధ్యక్షుడు చిరపంగి ఆశీర్వాదం సతీమణి పుల్లమ్మ (42) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె భౌతికకాయాన్ని తెదేపా రాష్ట్ర నాయకుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం సందర్శించి నివాళులర్పించారు. మల్లాది హనుమంతరావు, చెరుకూరి కృష్ణారావు, రాణి, జగన్మోహన్‌రావు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత చేప పిల్లల పంపిణీ

ఏన్కూరు, న్యూస్‌టుడే: మత్స్యశాఖ ఆధ్వర్యంలో చెరువుల్లో పోసేందుకు ఉచిత చేప పిల్లలను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గ్రామాల వారీగా సంఘాలకు చేప పిల్లల సంచులు ఎంపీడీవో ఎస్.రమేశ్, ఎంపీవో జీవీఎస్ నారాయణ అందజేశారు.

ఏఈగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

తల్లాడ, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ ఏఈగా రాయల ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మంలో పనిచేస్తూ బదిలీపై తల్లాడకు వచ్చారు. తల్లాడ సబ్ స్టేషన్ పరిధిలో ప్రజలు సమస్యలుంటే ఫోన్ లేదా నేరుగా తెలియజేయాలన్నారు.

దర్గా, ఖబరస్థాన్‌పై హక్కులు కల్పించాలని వినతి



ఎమ్మెల్యే రాగమయితో కలిసి కలెక్టర్‌కు సమస్య వివరిస్తున్న ముస్లింలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే మట్టా రాగమయి సమక్షంలో సత్తుపల్లికి చెందిన పలువురు ముస్లింలు ఖమ్మంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మంగళవారం కలిశారు. వేంసూరు రోడ్డులోని అటవీ ప్రాంతంలో తమ వినియోగంలో ఉన్న జాన్‌పాడ్ సైదులు దర్గా, ఖబరస్థాన్ ప్రదేశంపై హక్కులు కల్పించాలని, సరిహద్దులు నిర్ణయించి అధికారికంగా కేటాయించాలని వినతి పత్రం అందించారు. దాదాపు 700 ముస్లిం కుటుంబాలు నివాసం ఉంటున్నారని, ఎన్టీఆర్‌నగర్‌కు సమీపంలోని అటవీ భూముల్లో దాదాపు 40 ఏళ్ల క్రితం నుంచి తాము దర్గా, ఖబరస్తాన్ నిర్వహించుకుంటున్నామని వివరించారు. డాక్టర్ మట్టా దయానంద్, గ్రాండ్‌మౌలాలీ, కమల్‌పాషా, జాని, జిన్నీ పాల్గొన్నారు.

దళితబంధు నిధులు మంజూరు చేయాలి: బొమ్మెర: **మధిర, న్యూస్‌టుడే:** దళితబంధు నిధులను వెంటనే మంజూరుచేసి లబ్ధిదారుల ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేస్తూ భారాస సీనియర్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

వేతన ఒప్పందంపై అవగాహన

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సీఐటీయూ జాతీయ కార్యదర్శి సాయిబాబా సత్తుపల్లిలో మంగళవారం పర్యటించారు. పలు కార్మిక సంఘాల నాయకులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కిన్లే వాటర్ ఫ్యాక్టరీలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులు, యూనియన్ ముఖ్యనాయలతో సమావేశమై వేతన ఒప్పంద విషయమై అవగాహన కల్పించారు. లారీ యజమానులు, న్యూటాక్సీ కార్మికులతో మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, చలమాల విఠల్‌రావు, మల్లూరు చంద్రశేఖర్, కొలికపోగు సర్వేశ్వరరావు, కిషోర్, హరి, శ్రీను, ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.



కార్మికులతో సీఐటీయూ జాతీయ కార్యదర్శి సాయిబాబా

పంట నష్టం అంచనాలో అవకతవకలపై ఆందోళన

బోనకల్లు, న్యూస్‌టుడే: పంట నష్టం అంచనాలో తమకు అన్యాయం జరిగిందని బోనకల్లు, రాపల్లి, ఆళ్లపాడు గ్రామాలకు చెందిన రైతులు మంగళవారం రైతు వేదిక వద్ద ఆందోళన చేపట్టారు. అకాల వర్షాలకు పలు గ్రామాల్లో పత్తి, వరి దెబ్బతిన్నాయి. పంట నష్ట సర్వేలో తమకు అన్యాయం జరిగిందని మూడు గ్రామాల రైతులు మండల వ్యవసాయాధికారి వి.నాగేశ్వరరావుని నిలదీశారు. రైతుల ఒత్తిడితో ఏవో జాబితాలు ఇవ్వటంతో వాటిని చూసిన రైతులు మరింత ఆందోళన చేశారు. పావు ఎకరం కూడా నష్టపోని వారికి 12 ఎకరాలకు పరిహారం ఇచ్చారని, సాగు చేయని వారికీ పరిహారం వచ్చిందని ఆరోపించారు. దీనిపై తాము బుధవారం డీఏవో కార్యాలయం ముందు ధర్నా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ఏవోను నిలదీస్తున్న రాపల్లి, బోనకల్లు రైతులు

ఇరవై ఎకరాల్లో సమీకృత గురుకులం

వైరా, న్యూస్‌టుడే

◆ ఎమ్మెల్యే సూచనతో ప్రతిపాదన

తెలంగాణ ప్రభుత్వం నూతనంగా తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను వైరాలోనూ ఏర్పాటు చేసే వీలుందంటూ రెవెన్యూ అధికారులు ప్రతిపాదించారు. వైరాలోని మధిరరోడ్డులో తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల కళాశాల, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలున్నాయి. ఈ రెండు గురుకుల పాఠశాలలకు విశాలమైన ఆవరణ ఉంది. రెండింటికి కలిపి 24.11 ఎకరాల స్థలం ఉండగా ఇందులో కేవలం 4.03 ఎకరాల్లో మాత్రమే ఆయా గురుకుల పాఠశాలల నిర్మాణాలున్నాయని ఇవి పోను మిగిలిన 20.08 ఎకరాల స్థలం ఖాళీగా ఉందని రెవెన్యూ అధికారులు సర్వేలో నిర్ధారించారు. ఈ రెండు పాఠశాలలు కలిసే ఉండటంతో ఆయా ఇరవై ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయబోతున్న ఇంటిగ్రేటెడ్ మోడల్ గురుకుల పాఠశాల ఏర్పాటు చేయొచ్చంటూ స్థానిక ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ యోచించారు. ఆయన సూచనతో సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు ఈ మేరకు గుర్తించిన ఇరవై ఎకరాల ఖాళీ స్థలంలో సమీకృత గురుకుల పాఠశాలల సముదాయన్ని ఏర్పాటు చేసే వీలుందంటూ కలెక్టర్‌కు నివేదిక అందించారు. ఈ నివేదికను అత్యవసరంగా ప్రభుత్వానికి పంపించి త్వరలో జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ఆమోదింపజేసే ప్రయత్నాలు ఉన్నతస్థాయిలో జరుగుతున్నాయి. సమీకృత గురుకులాల ఏర్పాటుకు ఒకే చోట ఎక్కువ స్థలం అవసరం ఉంటుండగా వైరా నడిబొడ్డులో 20 ఎకరాల స్థలం ఉన్న నేపథ్యంలో ఆయా ప్రతిపాదన కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రెండు గురుకులాల ఆవరణలో ఇంకా 20.08 ఎకరాల స్థలం ఖాళీగా ఉందని ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు అనువుగా ఉందంటూ కలెక్టర్‌కు నివేదిక ఇచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.



వైరాలోని తెలంగాణ గురుకుల పాఠశాల

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

ఉపాధి పనుల్లో అక్రమాలు!

కామేపల్లి, న్యూస్‌టుడే: గ్రామ సభల్లో ఉపాధి పనుల అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. 15వ సామాజిక తనిఖీలో భాగంగా కొమ్మినేపల్లి, బర్లగూడెం పంచాయతీల్లో గ్రామ సభలను మంగళవారం నిర్వహించారు. మస్టర్లలో నమోదు చేయకుండానే వేతనం పంపిణీ చేయడం, లెక్కలో చూపిన మొక్కలకు సంరక్షించిన మొక్కలకు భారీ వ్యత్యాసం ఉండటంతో పాటు ఉపాధి సిబ్బంది నగదు వసూలు చేసినట్లు కూలీలు రాత పూర్వకంగా తనిఖీ సిబ్బందికి ఫిర్యాదు అందజేశారు. ఒకే పనికి రెండుసార్లు బిల్లులు చేసి రూ.లక్షల్లో ఉపాధి సిబ్బంది అక్రమాలకు పాల్పడినట్లు తనిఖీ బృందం సభ్యులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకట్, ఏపీవో శ్రీరాణి, ఉపాధి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును సందర్శించిన కమిషనర్

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని డంపింగ్ యార్డును కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం పరిశీలించారు. అక్కడ కంపోస్టు ఎరువు తయారు చేస్తున్న షెడ్లను పరిశీలించారు. కంపోస్టు ఎరువును నగరపాలక సంస్థ పరిధిలో మొక్కలకు ఉపయోగించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది సాంబయ్య, వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 91541 18165
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: బోడ్యాతండాలో వ్యర్థాలు తొలగించకపోవటంతో మురుగు కాల్వలు దోమలకు నివాసంగా మారాయి. **- రఘు, తండావాసి**

సమాధానం: వెంటనే చర్యలు తీసుకుంటాం. **- రామచంద్రారావు, ఎంపీవో**

– కూసుమంచి, న్యూస్‌టుడే

సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా: ఎంపీ



ఆసుపత్రి పాత భవనం పైన పరిశీలిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం సర్వజనాసుపత్రి సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఖమ్మం లోక్‌సభ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. పాత ఆస్పత్రి భవనంపైకి వెళ్లి మంగళవారం పైకప్పు లీకులను పరిశీలించారు. వైద్యాధికారులతో సమావేశమై సమస్యలపై చర్చించారు. ఆర్థిక ఇబ్బందులు, మౌలిక వసతులు, పరికరాలు, మానవ వనరుల సమస్యలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్ ఎంపీకి వివరించారు. వైద్య విధాన పరిషత్ నుంచి డీఎంఈ పరిధిలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలను వివరించారు. ఎంపీ మాట్లాడుతూ... జిల్లావాసులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. భవన నిర్మాణాలు, మరమ్మతులు, ఔషధాలు, పరికరాలకు సాంకేతిక సమస్యల వంటి ఇబ్బందులను అధిగమించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించి నివేదిక సమర్పించాలని సూచించారు. ఎంపీ ల్యాండ్ నుంచి మార్చురీకి అవసరమైన ఫ్రీజర్లకు నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, ఆర్ఎంఓలు కళావతిబాయి, రాంబాబు, వినాయక్ రాథోడ్, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, చావా శివరామకృష్ణ, మిక్కిలినేని నరేందర్, ఇమామ్, రవి, రామకృష్ణారెడ్డి, శీకళా పాల్గొన్నారు.

అజీజ్ కుటుంబానికి పరామర్శ

ఖమ్మం కమాన్‌బజార్: నగరంలోని కమాన్ బజార్ సదర్ అజీజ్ ఆయన సోదరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. బాధిత కుటుంబాలను మంగళవారం ఎంపీ రఘురాం రెడ్డి పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలియజేసి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో నాయకులు ముస్తాఫా, మజీద్, ఖాసీం, ఇమామ్, హకీం, గఫార్ పాల్గొన్నారు.

ఇంటి దొంగల వేట

కొత్త నంబర్ల కేటాయింపులో అవకతవకలు

దృష్టి సారించిన ఉన్నతాధికారులు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే



ఖమ్మం నగరపాలక సంస్థ ఇంటి నెంబర్ల కేటాయింపులో జరుగుతున్న అక్రమాల్లో ఇంటి దొంగలెవరన్న దానిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. కొత్త ఇంటి నెంబర్ కేటాయింపు, ఆస్తి మార్పిడి, ఇంటి పన్ను నిర్ధారణ వంటి అంశాల్లో రెవెన్యూ సిబ్బందిపై వస్తున్న ఆరోపణలు కొత్త వివాదాలకు తెరలేపాయి. నగరపాలక సంస్థ ఉద్యోగుల మధ్య ఉన్న భేదాభిప్రాయాలు, ఆధిపత్య పోరు కారణంగానే ఈ సమస్యలు తలెత్తుతున్నాయన్న వాదన వినవస్తోంది. ఖాళీ స్థలాలకు నెంబర్లు జారీ అవుతున్న తరుణంలో దీనికి కారణమైన సిబ్బంది విభాగాలు మార్చడం మినహా శాఖపరమైన చర్యలేవీ తీసుకోకపోవడంతో ఇవి నిరాటంకంగా కొనసాగుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

డీమ్డ్ అసెస్‌మెంట్లతో కష్టాలు

నగరపాలకంలో ఎవరైనా ఇంటి నెంబర్ పొందాలనుకుంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 21 రోజుల్లో పూర్తి చేయాలని నిబంధన ఉంది. పని ఒత్తిళ్ల కారణంగా ఆర్ఐ, బిల్ కలెక్టర్ క్షేత్రస్థాయిలోకి వెళ్లి వాటిని పరిశీలించే పరిస్థితి లేకపోతే డీమ్డ్ పేరిట వాటికి వెంటనే ఆన్‌లైన్‌లో కేటాయిస్తున్నారు. ఆ తరువాత సంబంధిత ఆర్ఐ, బిల్ కలెక్టర్లు వాటిని పరిశీలించి, అర్హులైతే అలాగే ఉంచి, లేని పక్షంలో కేటాయించిన నెంబర్‌ను రద్దు చేయాలి. కమిషనర్ లాగిన్ నుంచి వచ్చిన దరఖాస్తును సంబంధిత బిల్ కలెక్టర్‌కు పంపిన అనంతరం 15 రోజుల్లో క్షేత్రస్థాయిలో నివేదిక సమర్పించాలి. అయితే ఆ దరఖాస్తులను నిర్దేశించిన సమయంలో బిల్ కలెక్టర్ పరిశీలించకపోవడంతో అవి కాస్తా డీమ్డ్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఇంటి నెంబర్ల కేటాయింపు పూర్తవుతోంది. తాము ఇవ్వదలుచుకుంటే రెవెన్యూ సిబ్బంది కావాలనే వాటిని పరిశీలించడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ కేటాయింపుల్లో రూ.5 వేల నుంచి పది వేల వరకు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వారాంతపు సమీక్షలు లేకనే..

కమిషనర్ లాగిన్ నుంచి వచ్చిన రెవెన్యూ విభాగం దరఖాస్తుల విషయమై వారాంతపు సమీక్షలు లేకపోవడమే ఈ అక్రమాలకు కారణమన్న వాదన వినవస్తోంది. సమీక్షలతో ఎవరెవరికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి... ఎన్నింటిని పూర్తి చేశారో పరిశీలించకపోవడం, క్షేత్రస్థాయిలో పరిశీలించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆ ప్రభావం ఉద్యోగులందరిపై పడుతోందన్న వాదన వినవస్తోంది. రాజకీయ ఒత్తిళ్లతో కీలక విభాగాలు కేటాయించడంతో కొంతమంది సిబ్బంది ఆడింది ఆటగా మారిందని కొంతమంది ఉద్యోగులు వాపోతున్నారు. ఇక ఉన్నతాధికారులు, పాలకవర్గం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

నమూనాల సేకరణ

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని పలు హోటళ్లలో ఆహార పదార్థాలు, అక్కడ వినియోగిస్తున్న ఇతర వినియోగ వస్తువులను జిల్లా ఆహార తనిఖీ అధికారి కిరణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పదార్థాల, వస్తువుల నమూనాలను రసాయన పరీక్షల నిమిత్తం హైదరాబాద్ పంపనున్నట్లు తెలిపారు.

నిధులు విడుదల చేయాలని వినతి

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: దళిత బంధు పథకం మంజూరు చేసిన లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమా చేయాలని భారాస మధిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మెర రాంమూర్తి జిల్లా అదనపు కలెక్టర్ మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలు కావస్తున్న ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయలేదని, నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిషోర్, వీరభద్రం, వెంకటేష్, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రచార గోడపత్రిక ఆవిష్కరణ

ఖమ్మం నగరం: హైదరాబాద్‌లో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న ఎన్‌పీఆర్‌డీ నాలుగో రాష్ట్ర మహాసభల ప్రచార గోడపత్రికను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మంగళవారం ఖమ్మంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దోన్‌వాన్ నాగరాజు, లక్ష్మీనారాయణ, లక్ష్మీదేవి, శ్రీనివాసరావు, యాకూబ్, లక్ష్మణ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి: సీఈఓ

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: పీఏసీఎస్‌ల ద్వారా రైతులు రుణాలు పొంది వాటిని సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ సీఈఓ వసంతరావు అన్నారు. నేలకొండపల్లి మండలం పైనంపల్లి పీఏసీఎస్‌లో నూతనంగా రూ.30 లక్షల రుణాలను రైతులకు అందించే కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. పీఏసీఎస్ ఛైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు, నేలకొండపల్లి డీసీసీబీ మేనేజరు ఇందు తదితరులు పాల్గొన్నారు.

గమనించకుంటే గోతిలో పడ్డట్టే!



కూసుమంచి నుంచి గుర్వాయి గూడెం వెళ్లే రహదారిలో చెరువుకట్ట ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఇటీవల చెరువుకు భారీగా వరద పోటెత్తి కట్టపై నుంచి పొర్లడంతో మూడు ప్రాంతాల్లో కోతకు గురైంది. ఓచోట రహదారి సగం మేరకు ధ్వంసమైంది. ఇప్పటివరకు కనీస మరమ్మతులు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం సూచికలు లేక రాత్రి సమయంలో ఇబ్బందికరంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. కూసుమంచి నుంచి జుజ్జులరావుపేట, మల్లాయిగూడెం వెళ్లే రహదారి కూడా ఇదే కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ర.భ. ఏఈ దేవేందర్ దృష్టికి తీసుకెళ్లగా నిధులతో కూడుకున్న పని కావడంతో జాప్యం జరుగుతోందన్నారు. హెచ్చరిక సూచికలను వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. **– కూసుమంచి, న్యూస్‌టుడే**

తెచ్చారు.. పక్కన పడేశారు..!



ఖమ్మం నగరంలో కొత్తబస్టాండ్ సమీపంలోని ఫ్రీడమ్ పార్కులో రెండు పరికరాలను అమర్చకుండా అలాగే వదిలేశారు. ఇవి దారి మధ్యలో ఉండటంతో వ్యాయామ సాధనకు వచ్చే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈఅంశంపై ఈఈ కృష్ణలాల్ 'ఈనాడు'తో మాట్లాడుతూ ఆ పరికరాలనూ త్వరలో అమర్చి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. **– ఈనాడు, ఖమ్మం**

మున్నేరులో థర్మాకోల్ వ్యర్థాలు



జరిమానా విధిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఖమ్మం నగరపాలకంలోని ప్రకాష్‌నగర్ మున్నేరు ప్రాంతంలో థర్మాకోల్ వ్యర్థాలను పోసిన వారికి రూ.10 వేల జరిమానా విధించారు. మూడు టిప్పర్లలో తెచ్చిన వ్యర్థాలను మంగళవారం మున్నేరు పరీవాహక ప్రాంతంలో పోశారు. విషయం తెలుసుకున్న పారిశుద్ధ్య సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీంతో వ్యర్థాలను జేసీబీతో తిరిగి టిప్పర్లలోకి ఎత్తించి కమిషనర్ ఆదేశాల మేరకు జరిమానా విధించినట్ల పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సాంబయ్య తెలిపారు. నగరంలో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించే వారు, హోటళ్ల యజమానులు కాల్వల్లో వ్యర్థాలు వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది మల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి బహుమతులు



బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్ఎం సరిరాం

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఖమ్మం డిపో పరిధిలో రాఖీ, దసరా పండుగ ప్రత్యేక సర్వీసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఆర్ఎం అభినందించారు. బస్‌డిపోలో మంగళవారం డ్రైవర్, కండక్టర్లను నీళ్ల సీసాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికుల శ్రమతో మంచి ఫలితాలు సాధించామని అన్నారు. ప్రయాణికుల సంక్షేమమే లక్ష్యంగా ఆర్టీసీ పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ జీఎన్ పవిత్ర, ఏఓ బాలస్వామి, డిపో మేనేజర్ దినేష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు నూతన ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు కోరారు. ఖమ్మంలోని జిల్లా కార్యాలయంలో నగర పరిసర ప్రాంత మండలాల నూతన ఉపాధ్యాయులకు సర్వీసు వివరాలకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. యాప్స్‌పై సీనియర్ ఉపాధ్యాయులు ఎం.పాపారావు, విజయ్ అమృత్‌కుమార్, రత్నకుమార్ అవగాహన కల్పించారు.

క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

కామేపల్లి, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా జగన్నాథ తండా పంచాయతీకి వచ్చిన సివిల్ సర్వీసెస్ అధికారులు మంగళవారం పంట చేలను సందర్శించారు. వివిధ రకాల పంటల సాగు విధానం, వ్యయం, ఆదాయం గురించి రైతులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం రేపల్లెవాడలో గిరిజనుల గృహాలను సందర్శించారు.

పరేడ్‌కు ఎంపిక



నాగరాజుకు ఎంపిక పత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ పరంజ్యోతి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో పుణెలో నిర్వహించనున్న ప్రీ రిపబ్లిక్ డే వేడుకలకు నేలకొండపల్లి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక య్యారు. కోనేటి నాగరాజు 12 నుంచి 21 వరకూ నిర్వహించబోయే వేడుకలకు హాజరుకానున్నారు. ప్రిన్సిపల్ డా.ఆలేటి పరంజ్యోతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎన్.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎస్.రమేష్, నారాయణస్వామి తదితరులు అభినందించారు.

సమ్మేటివ్ పరీక్ష నిర్వహణను పరిశీలించిన ఏఎంఓ

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం నగరంలోని బాలాజీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మేటివ్-1 పరీక్షలను జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కేశవపట్నం రవికుమార్ మంగళవారం పరిశీలించారు. పరీక్ష ముగిసిన విద్యార్థులను విషయోపాధ్యాయుడి పర్యవేక్షణలో తదుపరి పరీక్షకు సన్నద్ధం చేయాలని అన్నారు. పదో తరగతి విద్యార్థుల స్థాయిని పరిశీలించి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అజిత, జయలలిత తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్

కూసుమంచి, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని, రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం, సీపీఎం బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ కరుణశ్రీకు వినతి పత్రం ఇచ్చారు. ఎన్నో కష్టాలకు ఓర్చి వ్యవసాయం చేస్తున్న రైతులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పెద్దలు రైతులను నిలువునా మోసం చేశారని ఆరోపించారు. సీపీఎం మండల కార్యదర్శి యడవల్లి రమణారెడ్డి, రైతు సంఘం బాధ్యులు సన్మతరావు, శీలం గురుమూర్తి, తోటకూర రాజు, బిక్కసాని గంగాధర్, గన్యానాయక్, బాసు నాయక్, వీరారెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా గోడ కూల్చివేత: ముస్లింల ఆందోళన



పాలేరులో ఈద్గా స్థలంలో ఆందోళన నిర్వహిస్తున్న ముస్లింలు

కూసుమంచి, న్యూస్‌టుడే: పాలేరులో ఈద్గా గోడ కూల్చివేతను నిరసిస్తూ స్థానిక ముస్లింలు బుధవారం ఆందోళన నిర్వహించారు. గోడను తిరిగి నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఈద్గా వద్ద నినాదాలు చేశారు. బాధ్యుడైన వ్యక్తిపై పోలీసు ఠాణాలో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అందులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ముస్లింలు రంజాన్, బక్రీద్ పర్వదినాల సమయంలో పాలేరు జలాశయం ఎదురుగా ఉండే ఈద్గా స్థలంలో నమాజు చేసేవారు. 2006లో రక్షిత తాగునీటి పథకం నిర్మాణానికి అదే స్థలాన్ని అధికారులు గుర్తించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సంప్రదింపుల అనంతరం ముస్లింలు తాగునీటి పథకం నిర్మాణానికి అంగీకరించిన నేపథ్యంలో సర్వే నం.506 లోని నాలుగు గుంటల ప్రభుత్వ స్థలాన్ని అధికారులు అప్పగించారు. 18 ఏళ్లుగా అక్కడే ఈద్ నమాజును ఆచరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ స్థలం తమదంటూ సరిహద్దు స్థలంలో నిర్మాణాలు చేపట్టిన ఖమ్మం నగరానికి చెందిన సయ్యద్ ఇక్బాల్ అనే వ్యక్తి జేసీబీ యంత్రంతో ఈ నెల 16న ఈద్గా గోడ కూల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు: ఈద్గా గోడ కూల్చివేతకు పాల్పడిన సయ్యద్ ఇక్బాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ప్రార్థన మందిరాన్ని ధ్వంసం చేసినట్లు స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి: పోటు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: రెండు పడక గదుల ఇళ్లలో నివాసముండే కుటుంబాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని 60వ డివిజన్ మల్లెమడుగులో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల సంక్షేమ సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా బోడా వీరన్న, 10 మంది కార్యవర్గ, 26 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో పోటు ప్రసాద్ మాట్లాడుతూ.. మల్లెమడుగు ప్రాంత అభివృద్ధికి సీపీఐ కట్టుబడి ఉందని, రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎస్‌కె.జానిమియా, నాయకులు బోజడ్ల సూర్యం, పీట్ల కృష్ణమూర్తి, తేజావత్ కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్

ఇద్దరు ఆటో చోరుల అరెస్టు

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆటో చోరీ చేసిన ఇద్దరు నిందితులను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. కస్బాబజార్‌లో సుధాకర్‌కు చెందిన ఆటోని నిజాంపేటకు చెందిన కొనకంచి ప్రతాప్, దాసరి రాజశేఖర్‌లు ఇటీవల చోరీ చేశారు. సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టి నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆటోను స్వాధీనం చేసుకుని, వారిని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

భూతగాదాలో ముగ్గురిపై కేసు

కామేపల్లి, న్యూస్‌టుడే: భాసిత్‌నగర్‌కు చెందిన ఓ మహిళపై భూ తగాదా విషయంలో ఘర్షణ పడి దాడి చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన బి.రామదాసుతో పాటు మరో ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేశామని ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

అయోడిన్ ప్రాధాన్యం గుర్తించాలి

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: అయోడిన్ ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అసంక్రమిత వ్యాధుల నివారణ ప్రోగ్రాం అధికారి డా.డి.రామారావు అన్నారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జిల్లా మలేరియా అధికారి డా.వెంకటరమణతో కలిసి మంగళవారం ఆయన సందర్శించారు. అయోడిన్ లోపంతో కలిగే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. జిల్లా అంతటా వారం రోజుల పాటు ప్రతి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అయోడిన్ లోపంతో కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పిస్తున్నట్లు డా.రామారావు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామారావు, వేదికపై వెంకటరమణ తదితరులు

పన్నుల వసూళ్లపై కమిషనర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో వివిధ రకాల పన్నుల వసూళ్లపై కమిషనర్ అభిషేక్ అగస్త్య సమీక్షించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రతి బిల్ కలెక్టర్‌కు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఇదే సమయంలో కేటాయించిన డివిజన్‌లో నివాస, నివాసేతర గృహాల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఆయా డివిజన్లలో వ్యాపారాలు నిర్వహించే ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. పన్నులు బకాయి పడిన వారికి నోటీసులు జారీ చేయాలని, అప్పటికి చెల్లించకపోతే భవనాలను సీజ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్వో జి.శ్రీనివాస్, ఆర్ఐలు జ్యోతి, రామారావు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ అమలు విస్మరిస్తే సహించేది లేదు'



నినాదాలు చేస్తున్న వంగూరు ఆనందరావు తదితరులు

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ పాలేరు డివిజన్ ఇన్‌ఛార్జి వంగూరు ఆనందరావు అన్నారు. తల్లంపాడు, మద్దులపల్లి గ్రామాల్లో మంగళవారం సంఘం గ్రామసభలు నిర్వహించారు. ఆనందరావు మాట్లాడుతూ ఇప్పటికే డీఎస్సీ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయలేదని, ముందు చేపట్టే ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్‌రావు, అశోక్, రాములు, కుమార్, రాము, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావు: తెదేపా

ఖానాపురం హావేలి, న్యూస్‌టుడే: తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల లేఖలను తిరుమల దర్శనానికి స్వీకరించడం లేదని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలను ఖమ్మం తెదేపా నాయకులు ఖండించారు. కొండబాల కర్ణాకర్, అప్పారావు, వెంకటేశ్వర్లు, ఎన్.శ్రీనివాస్, కోటేశ్వరరావు, అశ్వనీకుమార్ పాల్గొన్నారు.

రూ.3 లక్షల చెక్కు అందజేత

ఖమ్మం గాంధీచౌక్, న్యూస్‌టుడే: నగరంలోని ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీలో సభ్యుడైన భూక్యామోహన్(38) ఇటీవల విద్యుత్తు ప్రమాదంలో మృతి చెందారు. ఇతనిది తిరుమలాయపాలెం మండలం బచ్చోడు. ఖాతాదారుడు కావడంతో ప్రమాద బీమా పథకం నుంచి ఇతని కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును మంగళవారం అందజేసినట్లు రీజినల్ మేనేజర్ జి.సాయిబాబు తెలిపారు. బ్రాంచి మేనేజర్ కె.సైదేశ్వరరావు, సిబ్బంది ప్రమోద్‌కుమార్, రాజేశ్, రాంగోపాల్, మహేశ్, లక్ష్మణరావు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

పైపులు వేశారు... చదును మరిచారు!



దానవాయిగూడెం కాలనీలో ఇళ్ల చుట్టూ నిలిచి ఉండే వర్షం నీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన పనుల్లో చిత్తశుద్ధి లేక మరో సమస్యను నగరపాలక సిబ్బంది సృష్టించారు. స్థానికంగా గత నెలలో వచ్చిన భారీ వర్షాలు, వరదల సమయంలో నివాసాల చుట్టూ నీరు రోజుల తరబడి నిలబడి ఉంది. దీన్ని పరిష్కరించాలన్న స్థానికుల విజ్ఞప్తితో పాఠశాల సమీపంలోని ఓ అంతర్గత రహదారికి నీరు వెళ్లి పోయేలా పైపులు వేసే పని చేపట్టారు. పైపులు వేసేందుకు తవ్విన మట్టిని రహదారిపై అడ్డంగా పోసి చదును చేయకపోవడంతో రాకపోకలకు వీలు లేకుండా పోయింది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నెలన్నర గడిచినా సమస్య పరిష్కారం కాకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారిపై మట్టిని చదును చేసి రాకపోకలకు వీలు కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులను వివరణ కోరగా.. పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.

– ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే